

మరమ్మతులు చేయించిన తర్వాత వినియోగానికి సిద్ధంగా ఉన్న చెత్త వాహనం

అందుబాటులోకి 'చెత్త' వాహనం

● మరమ్మతులు చేయించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సరూర్‌నగర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): 'తుప్పు పడుతున్న చెత్త వాహనం' అనే శీర్షికతో గత శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తా కథనానికి బడంగ్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించారు. నిత్యం ప్రధాన రహదారులపై గల చెత్తను తరలించే సదరు వాహనం మరమ్మతులకు గురై దాదాపు నెల రోజులకు పైగా నిరుపయోగంగా మారింది. సిబ్బంది దానిని బాగుచేయడంపై దృష్టి పెట్టకుండా గుర్రంగూడలోని వార్డు కార్యాలయం ఎదుట వదిలేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో అధికారులు స్పందించి శనివారం వాహనానికి మరమ్మతులు చేయించారు. సదరు ఆటోతో పాటు మరో రెండు, మూడు వాహనాలు సైతం పాడవగా.. వాటన్నింటినీ బాగు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చామని బడంగ్‌పేట్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వి.యాదగిరి తెలిపారు. తాము చెత్త సేకరణ, తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఆయన పేర్కొన్నారు.



కరాటేలో సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో సినీ హీరో సుమన్ తదితరులు

ఆత్మరక్షణ కోసం కరాటేలో తర్ఫీదు అవసరం

● కరాటే గ్రాండ్ మాస్టర్, సినీ హీరో సుమన్

సరూర్‌నగర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణ కోసం పాఠశాల స్థాయి నుంచే బాలబాలికలు కరాటేలో తర్ఫీదు పొందడం ఎంతో అవసరమని కరాటే గ్రాండ్ మాస్టర్, సినీ హీరో సుమన్ అన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు కరాటే నేర్చుకోవడం ద్వారా తమపై ఎవరైనా అఘాయిత్యాలకు ప్రయత్నించినప్పుడు ధైర్యంగా ఎదుర్కోగలుగుతారని ఆయన అన్నారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో గల లార్డ్స్ హైస్కూల్‌లో ఆదివారం 'ఆరోహం-2025' పేరుతో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌ను సుమన్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం సుమన్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో కరాటే శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. కార్యక్రమంలో లార్డ్స్ విద్యా సంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీలత, డీన్ సతీశ్‌కుమార్, ప్రిన్సిపాల్ మరియన్, మాజీ కార్పొరేటర్లు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ సెల్లార్ తవ్వకాలపై చర్యలు తీసుకోండి



నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ తవ్వకాలు

సైదాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఐఎస్ సదన్ డివిజన్ లక్ష్మీనగర్‌కాలనీ చౌరస్తాలో ఎలాంటి అనుమతులు లేకుండా సెల్లార్ గుంతతీసి నిర్మాణం చేస్తున్నవారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్. చంద్రశేఖర్‌రెడ్డి జీహెచ్ఎంసీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీలకు ఫిర్యాదు చేశారు. సెల్లార్ నిర్మాణ పనులతో ప్రమాదపు అంచులో పక్కనే బిల్డింగులు ఉన్నాయన్నారు. దీంతో అపార్టుమెంట్ వాసులు భయంతో గడుపుతున్నారని తెలిపారు. ఈ మధ్యనే ఎల్బీనగర్‌లో ఈ తరహా సంఘటన చూశామని, మళ్లీ అలాంటి ప్రమాదాలు జరగకముందే తాము హెచ్చరిస్తున్నామని అన్నారు. అయినా కూడా ఎవరు చర్యలు తీసుకోవడం లేదన్నారు. పలుమార్లు స్థానిక టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా చర్యలు లేవని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొనాలని, నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అక్రమ నిర్మాణంపై చర్యలు చేపట్టకపోతే కాలనీవాసులతో కలిసి అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్లు హెచ్చరించారు.



క్రీడాకారులకు అభినందనలు తెలుపుతున్న బేర బాలకిషన్

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకే స్పోర్ట్స్‌మీట్‌లు

మన్సూరాబాద్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోన్న స్పోర్ట్స్ మీట్‌లు ఎంతగానో దోహదపడతాయని మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బేర బాలకిషన్ పేర్కొన్నారు. సరూర్‌నగర్ డివిజన్ విక్టోరియా మెమోరియల్ హోమ్ రెసిడెన్షియల్ స్కూల్ మైదానంలో ఎస్సీ హాస్టల్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ జిల్లా ఎస్సీ హాస్టల్స్ విద్యార్థుల స్పోర్ట్స్ మీట్‌ను ఆదివారం ముఖ్యఅతిథిగా విచ్చేసిన బేర బాలకిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్పోర్ట్స్ మీట్‌లలో పాల్గొని ప్రతిభ చాటాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీఎం హోమ్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ శివప్రసాద్, ఉపాధ్యాయులు నర్సింగ్, నాయకులు బాగ్‌మార్ సత్యనారాయణగౌడ్, ఎస్సీ హాస్టల్స్ క్రీడాకారులు పాల్గొన్నారు.

సునరితారెడ్డి కుటుంబానికి ఎమ్మెల్సీ కవిత పరామర్శ



సునరితారెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

సంతోష్‌నగర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తీగల కనిష్క్ రెడ్డి కుటుంబీకులైన శాలివాహననగర్ మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి, అజిత్‌రెడ్డి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ ఆదివారం పరామర్శించారు. కనిష్క్‌రెడ్డి మరణం విషయం తనను తీవ్రంగా కలిచివేసిందని కవిత కంటతడిపెట్టారు. భగవంతుడు సునరితారెడ్డి దంపతులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని వేడుకుంటున్నట్లు తెలిపారు.



ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీగల కనిష్క్‌రెడ్డి మృతి చెందగా ఆయన తండ్రి బీఆర్ఎస్ మలక్‌పేట ఇన్‌చార్జి తీగల అజిత్‌రెడ్డిని పరామర్శిస్తున్న రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, కాంగ్రెస్ నాయకుడు సంఘీరెడ్డి - సంతోష్‌నగర్, ఆంధ్రజ్యోతి

ఏకశిల పదునెట్టాంబడి..
వార్షిక బ్రహ్మోత్సవాలు

● 11 నుంచి 13 వరకు

● స్వాములు, భక్తులకు అన్నదానం



ఆలయంలో నిత్యపూజలందుకుంటున్న అయ్యప్పస్వామి



ఆలయంలోని ఏకశిల పదునెట్టాంబడి(బంగారు మెట్లు)



విద్యుద్దీపాల వెలుగుల్లో శ్రీ హరిహరక్షేత్ర అయ్యప్ప ఆలయం

చంపాపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్వామియే శరణం అయ్యప్ప అంటూ నిత్యం శ్రీహరిహరక్షేత్రం అయ్యప్పస్వామి ఆలయం మారుమోగుతుంది. హస్తినాపురం డివిజన్ సాగర్ రింగ్‌రోడ్డు బైరామల్‌గూడ, డిఫెన్స్‌కాలనీలోని హరిహరక్షేత్రాన్ని 2009లో నిర్మాణ పనులు చేపట్టారు. హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యాభారతిస్వామి పర్యవేక్షణలో ఆలయ నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. ఆలయ ధర్మకర్తలు, భక్తుల విరాళాలతో సుమారు రూ.12కోట్లు వెచ్చించి ఆలయాన్ని రెండేండ్లలో సుందరంగా నిర్మించారు.

పాలమూరు జిల్లా నుంచి..

ఆలయంలో ఏకశిల పదునెట్టాంబడి(బంగారు మెట్లు) ఏర్పాటు కోసం అప్పటి మహబూబ్‌నగర్ జిల్లా (ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లా)చారగొండ మండలం శిరుసనగండ్ల గుట్టలోని సీతారామచంద్రస్వామి ఆలయాన్ని ఎంచుకున్నారు. గుట్ట నుంచి 160టన్నుల బండను తొలిచేందుకు శిల్పులు రేయింబవళ్లు కష్టపడ్డారు. ఎనిమిది మాసాల పాటు శిల్పులు శ్రమించి ఏకశిల పదునెట్టాంబడిని చెక్కారు. ఏకశిల పదునెట్టాంబడిని ఇక్కడి ఆలయంలో ప్రతిష్ఠించారు. అయ్యప్పస్వామి మహాపడి పూజ కార్యక్రమంలో ఏకశిల పదునెట్టాంబడిలో పడిని వెలిగించేందుకు స్వాములు పోటీ పడుతారు. నియమ నిష్ఠలతో అయ్యప్ప మాలధారణ స్వాములు నిత్యం ఆలయంలో పడిపూజలు నిర్వహిస్తారు.

అక్కన్న మాదన్న ఆలయాలు

శ్రీ హరిహర క్షేత్రం నిర్మించిన ప్రదేశంలో గతంలో ప్రసిద్ధి గాంచిన అక్కన్నమాదన్న ఆలయాలు ఉన్నట్లు ఆనవాళ్లు ఉన్నాయి. భక్త రామదాసు మేనమామలైన అక్కన్న మాదన్న ఆలయాలను వందల సంవత్సరాల క్రితం తానీషా పాలనలో సామంతరాజులు నిర్మించారు. కాలక్రమేనా ఆలయాల నిర్వహణ బాధ్యతలను ఎవరూ పట్టించుకోకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. అక్కడే హరిహర క్షేత్రం నిర్మాణానికి పునాది పడింది.

భారీ ఏర్పాట్లు

శ్రీ హరిహర క్షేత్ర అయ్యప్పస్వామి ఆలయంలో ఈ నెల 11 నుంచి హంపీ విరూపాక్ష పీఠాధీశ్వరులు విద్యారణ్య భారతి స్వామి వారి పర్యవేక్షణలో అత్యంత దేదీప్యమానంగా విరాజితంగా నిర్వహించ సంకల్పించిన పాంచహ్నిక దీక్షా పూర్వక 14వ వార్షిక బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. 11న ఉదయం 8గంటలకు గణపతిపూజ, మంగళవాయుద్యం, పుణ్యాహవచనం, వేదస్వస్తి, గోపూజ, అఖండదీప స్థాపన, దీక్షాధారణ, అంకురారోపణ, కంకణధారణ, యాగశాల ప్రవేశం, లక్ష్మీగణపతి సహిత నవగ్రహ హోమం, సాయంత్రం 5:30గంటల నుంచి వేదస్వస్తి, మండపారాధన పూజలు, ధ్వజస్తంభ జెండా ఆవిష్కరణ, శ్రీవల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం, 12న ఉదయం 8గంటలకు గణపతిపూజ, అయ్యప్పస్వామి మూల మంత్ర హవనములు, సుదర్శనహోమం, సాయంత్రం 5గంటలకు మండపారాధనలు, కుంకుమపూజలు 13న ఉదయం గణపతిపూజలు, స్వస్తి పుణ్యాహవచనం, ప్రధాన ఆలయ దేవతా మూర్తులకు ప్రత్యేక అభిషేకములు, అలంకరణలు, విజయశక్తి హోమం, మహాపూర్ణాహుతి, హారతి, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం 6గంటల నుంచి పుష్పాభిషేకం, హరిహర సుత అయ్యప్పస్వామి వారి ఏకశిలా నిర్మితం మహాపడిపూజ కార్యక్రమాన్ని ప్రధాన అర్చకులు రంజిత్ తాంత్రి, రమణ గురుస్వామి, రాఘవేంద్రరావు దేశ్ పాండే గార్ల చేత పదునెట్టాంబడి, భజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. భక్తులకు ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు.

దాతల సహకారంతో ఆలయం



దాతల సహకారంతో శ్రీ హరిహర క్షేత్రం అయ్యప్పస్వామి ఆలయాన్ని నిర్మించాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయంలో సౌకర్యాలు కల్పించాం. ఆలయంలో అయ్యప్పస్వామి వారితో పాటు ఇతర ఆలయాలను నిర్మించాం. అయ్యప్పస్వామి భక్తులకు నిత్యం అన్నదానం ఏర్పాటు చేస్తాం. దాతలు, ధర్మకర్తల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తాం. ఆలయ అభివృద్ధి కోసం దాతలు మరింత సహకరించాలి. బ్రహ్మోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలి. పలువురు ప్రజా ప్రతినిధులు తదితరులు ఈ బ్రహ్మోత్సవాలలో పాల్గొననున్నారు.

- వంగా మధుసూదన్‌రెడ్డి, కార్పొరేటర్, దేవాలయ వ్యవస్థాపకులు

ఎల్బీనగర్ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నియోజకవర్గంపై పూర్తి అవగాహనతో తాను ఇరువై రెండు ఏళ్లుగా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం ఫేజ్-2లో ఉన్న గ్రౌండ్‌లో కొన్ని రోజులుగా కాలనీవాసులు కొందరు పార్కు కావాలనీ, మరికొందరు ప్లే గ్రౌండ్ కావాలనీ అడిగిన నేపథ్యంలో ఆదివారం కాలనీవాసులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లినట్లు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఎల్బీనగర్‌లోని ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అనేక పార్కులను ఏర్పాటు చేశానన్నారు. ఈ క్రమంలో 2018 నుంచి యువతను దృష్టిలో పెట్టుకుని పార్కులకు బదులుగా క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగానే పార్కుల్లో ఓపెన్ జిమ్, స్విమ్మింగ్ పూల్స్, క్రీడ స్థలాలను ఏర్పాటు చేశానని తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో 99 శాతం అభివృద్ధి పనులను తానే చేశానన్నారు. కార్యక్రమంలో వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్‌గుప్తా, నాయకులు గడ్డం మల్లేష్‌గౌడ్, సంజయ్‌కుమార్, మిట్టా రామ్మోహన్ పాల్గొన్నారు.

ఎంవీఎస్ఆర్‌లో అల్థోన్-2025

● కృత్రిమ మేధతో పీవీ ప్రసంగం



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

సరూర్‌నగర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఆదివారం 'అల్థోన్-2025' పేరుతో ఎన్ఎల్‌పీ(నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్), ఎల్ఎల్ఎం(లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్) అనే అంశాలపై బూట్‌క్యాంప్ అండ్ హాకథాన్ నిర్వహించారు. ఏఐ(కృత్రిమ మేధ)పై ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. కృత్రిమ మేధ ద్వారా ఎన్ఎల్‌పీ, ఎల్ఎల్ఎంలో ఆధునిక సాంకేతికతల వినియోగంపై వక్తలు ప్రసంగించారు. నిజ జీవితంలో ఏఐ ప్రాముఖ్యతపై చర్చించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన ఇండియన్ సర్వీసెస్ అండ్ ఏఐఎంఈఆర్ఎస్ సీఈవో సాయి సతీశ్, విప్రో సంస్థ ప్రతినిధి రాజీవ్ రంజన్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు ఏఐ టెక్నాలజీపై పట్టు సాధించడానికి ప్రయత్నించాలని, భవిష్యత్తులో అన్ని విషయాల్లో కృత్రిమ మేధ ప్రధాన పాత్ర పోషించనున్నదని పేర్కొన్నారు. పరిశ్రమలు-కళాశాలల భాగస్వామ్యంతో చేపట్టే నియామకాల్లో ఏఐ టెక్నాలజీని వినియోగించుకోవాల్సిన అవసరం ఉన్నదని వారు అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ, ఎంవీఎస్ఆర్ చైర్మన్ కాశ్యప్, డీన్ కేవీజీ రావు, కన్వీనర్ కృష్ణప్రసాద్, ప్రొఫెసర్ ప్రసన్నకుమార్, సౌజన్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా పీవీ ప్రసంగం

కార్యక్రమంలో భాగంగా కృత్రిమ మేధ ద్వారా మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ప్రసంగాన్ని రూపొందించారు. స్వయంగా పీవీ వచ్చి కార్యక్రమంలో పాల్గొన్నట్టుగా తయారు చేసి, ఎంవీఎస్ఆర్ కాలేజీలో ఏఐ టెక్నాలజీని అభినందిస్తున్నట్టుగా రూపొందించి ఔరా అనిపించుకున్నారు. అతిథులు, విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.

మీర్‌పేట్‌లో ఇంటి పన్నుల భారం తగ్గించడానికి కృషి

● టఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి



ఇంటి పన్నులు తగ్గించాలని కోరుతూ చల్లాకు వినతిపత్రం అందజేస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

సరూర్‌నగర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లో ఇళ్ల యజమానులు ఎదుర్కొంటున్న పన్నుల భారాన్ని తగ్గించడానికి కృషి చేస్తానని టఫ్ఐడీసీ చైర్మన్, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకునేలా చూస్తానని ఆయన పేర్కొన్నారు. ఆదివారం జిల్లెలగూడలోని వంగ శంకరమ్మ గార్డెన్స్‌లో నిర్వహించిన ఫెడరేషన్ ఆఫ్ మీర్‌పేట్ కాలనీస్ అసోసియేషన్ ద్వితీయ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్ల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి వంటేరు నర్సింహారెడ్డి మాట్లాడుతూ తాము ఎదుర్కొంటున్న పన్నుల భారం సమస్యను చల్లాకు వివరించి వినతిపత్రం అందజేశారు. పక్కనే ఉన్న బడంగ్‌పేట్‌లో, జీహెచ్ఎంసీలో ఇంటి అద్దె(రెంటల్ వాల్యూ) ఆధారంగా పన్నులు విధిస్తున్నారని, మీర్‌పేట్‌లోనూ అదే పద్ధతి అవలంబించేలా చూడాలని వారు ఆయనను కోరారు. అనంతరం చల్లా మాట్లాడుతూ మీర్‌పేట్‌లో పన్నుల భారం అధికంగా ఉన్నమాట వాస్తవమేనని, గతంలో తాను ఈ సమస్యపై ఉద్యమం కూడా చేపట్టానని, దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు వెంకటయ్య, మల్లారెడ్డి, ప్రేమ్‌చందర్‌రెడ్డి, పద్మాచారి, శివానందం, శ్రావణ్, ప్రభాకర్‌రావు, జగాల్‌రెడ్డి, శాంతమూర్తి, సుధాకర్‌రెడ్డి, సహదేవ్, అర్జున్, మాలతి, సునీత, రాజేశ్వర్‌రెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో ఎర్రజెండాను ఎగురవేయాలి : యాదిరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో ఎర్ర జెండాను ఎగురవేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర్ హరిసింగ్‌నాయక్, ఓటీసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దాసరి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ ఆర్ఎన్ఆర్‌కాలనీ సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన లేబర్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి యాదిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మికులకు లేబర్ కార్డులతో పాటు ఇన్సూరెన్స్ కార్డులను పంపిణీ చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కార్మికుల పిల్లలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని డిమాండ్ చేశా రు. డబుల్‌బెడ్‌రూం ఇల్లుతో పాటు 50ఏళ్లు నిండిన కార్మికులకు రూ.5 వేల పింఛన్‌ను అందించాలన్నారు. ప్రమాదంలో మరణించిన కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మన్, చిర్ర శేఖర్, నిరంజన్, వెంకటేష్, రవి, నీలాబాయి, రవళి, షైన్, జ్యోతి, రాజు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగును తిరిగి అప్పగింత

● సీసీ కెమెరాల ఆధారంతో కనిపెట్టిన పోలీసులు



దంపతులకు పోగొట్టుకున్న బ్యాగును అందిస్తున్న సీఐ నాగరాజుగౌడ్

హయత్‌నగర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి ఇంటికి వచ్చే క్రమంలో నగలు, నగదుతో ఉన్న బ్యాగును దంపతులు శనివారం ఆటోలో పోగొట్టుకున్నారు. దంపతుల నుంచి ఫిర్యాదు అందుకున్న హయత్‌నగర్ క్రైం పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ఆధారంతో ఆటో డ్రైవర్‌ను గుర్తించారు. క్రైం పోలీసులు ఆదివారం బంజారాకాలనీలో నివాసం ఉండే ఆటో డ్రైవర్ ఇంటికి వెళ్లి నగలు, నగదుతో ఉన్న బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. దంపతులను పిలిపించి సీఐ నాగరాజుగౌడ్ బ్యాగును అప్పగించారు. వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్‌కు చెందిన వీర సత్య మల్లేష్, ఆయన భార్య సుష్మలు శనివారం హయత్‌నగర్ సూర్యానగర్‌కాలనీలో నివాసం ఉండే శరత్‌చంద్ర ఇంటికి బయలుదేరారు. హయత్‌నగర్ బజాజ్ షోరూం వద్ద బస్సు దిగిన వారు ఆటోలో సూర్యానగర్‌కాలనీకి వెళ్లారు. ఈ క్రమంలో వారి వద్ద ఉన్న బ్యాగును ఆటోలోనే మరిచిపోయి దిగారు. ఇంటికి వెళ్లి చూసుకునే లోపు ఆటో వెళ్లిపోయింది. వెంటనే వారు హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా బంజారాకాలనీకి చెందిన బూక్యా నాగేశ్వరరావు ఆటోగా గుర్తించారు. వెంటనే పోలీసులు ఆదివారం ఉదయం బూక్యా నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి ప్రశ్నించగా బ్యాగు తన వద్దనే ఉందని చెప్పారు. పోలీసులు సదరు బ్యాగును స్వాధీనం చేసుకుని దంపతులను పిలిపించి వారికి అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ కట్టా వెంకట్‌రెడ్డి, క్రైం పోలీసులు పాల్గొన్నారు.



వీరభద్రస్వామి కల్యాణ వేడుకల్లో మాజీ సర్పంచ్ వీరస్వామిగౌడ్, గ్రామపెద్దలు

ఘనంగా వీరభద్రస్వామి కల్యాణం

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బలిజగూడలోని వీరభద్రస్వామి ఆలయంలో శనివారం రాత్రి వీరభద్రస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయంలో స్వామి వారికి అభిషేకం అనంతరం సాయంత్రం 6గంటలకు కల్యాణ మండపంలో వేద పండితుల మంత్రోచ్చరణలు, వందలాది మంది భక్తుల సమక్షంలో వీరభద్రస్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక, సమీప గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారికి తలంబ్రాలు పోసి మొక్కులు సమర్పించారు. మాజీ సర్పంచ్ బుర్ర వీరస్వామిగౌడ్, ఉప్పు వెంకటేష్, సురేష్, బుర్ర జ్ఞానేశ్వర్ గౌడ్, టీ. వెంకటేష్, ఉప్పు సతీష్‌కుమార్, బి. దాసుగౌడ్, దశరథ, వీరేశం, బాబు, శివ, వినోద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

మకరతోరణ పూజలు

ఓల్డ్‌మలక్‌పేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ ధోబిగల్లిలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో ఆదివారం మకరతోరణ ప్రారంభోత్సవ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా గుడి వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా దాతలను కమిటీ సభ్యులు సన్మానించారు. పూజా కార్యక్రమాల్లో కమిటీ సభ్యులు బి.సుదర్శన్, బాబు శ్రీనివాస్, నర్సింగ్‌రావు, రవీందర్, శ్రీదేవి, రాకేష్, రాజేశ్వరి, మోహన్ పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠాపనకు ముందు ధ్వజస్తంభానికి పూజలు నిర్వహిస్తున్న బ్రాహ్మణులు

సరూర్‌నగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ కింది వార్డులో గల సీతారామ భక్తాంజనేయస్వామి ఆలయంలో మూడు రోజులుగా కొనసాగుతున్న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. వేద పండితులు నూతన ధ్వజస్తంభానికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు కలిసి ఆలయం ఆవరణలో ప్రతిష్ఠించారు. అనంతరం ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు.

పోచమ్మ ఆలయంలో..



ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

వనస్థలిపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం హుడా కాలనీ ఫేజ్-2 లోని పోచమ్మ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కనులపండువగా జరుగుతున్నాయి. అందులో భాగంగా రెండవరోజు ఆదివారం ఆలయంలో అమ్మవారికి వేద పండితులు యాగశాలలో ఆరాధన చండీ వాహనం, ధ్వజస్తంభ ఆరాధన, దాన్యదివాసం, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఆనంద్‌రాజ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు రాములు, శ్రీనివాస్‌రావు, సతీష్‌కుమార్‌గుప్తా, వెంకటేష్, నాగేష్, భవానీ ప్రమోద్‌కుమార్, భవానీ అనిత, భవానీ రాజశేఖర్, విజయ, కాలనీవాసులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండరావిరాల గ్రామానికి చెందిన పలువురు కార్యకర్తలు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్, కందికంటి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి బీఆర్ఎస్ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఏడాదిలోనే విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు పూజారి చక్రవర్తిగౌడ్, గుండ్ల జంగయ్య, దానేష్, దయాకర్‌రెడ్డి, అర్జున్ పాల్గొన్నారు.